క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



విజయసాయిరెడ్డితో శ్రీనివాసులు యాదవ్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి పులి శ్రీనివాసులు యాదవ్ ఎంపీ విజయసాయిరెడ్డిని నెల్లూరులో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో నిర్వహించే పలు కార్యక్రమాల గురించి ఎంపీ విజయసాయిరెడ్డితో చర్చించారు.

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో లక్ష్మీదేవి

పొదలకూరు : స్థానిక లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష్మీదేవి జయంతి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి 1,001 నామాలతో లక్ష్మీ సహస్ర నామార్చన, 7 గంటలకు కుంకుమ పూజ జరిపించారు. మహిళలు కుంకుమ పూజకు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నారాయణలో ముందస్తు తరగతులు

- నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ

ముత్తుకూరు : మండలంలోని బ్రహ్మదేవిలో ఉన్న నారాయణ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు తరగతులు నిర్వహిస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి సుమన్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన వెంటనే ద్వితీయ సంవత్సరానికి వచ్చిన విద్యార్థులకు ముందస్తు తరగతులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. దీని వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సోమిరెడ్డికి ఓటమి తప్పదు

- కొలనకుదురు, కట్టువపల్లిలో మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం



మంత్రి కాకాణికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మనుబోలు : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సోమిరెడ్డికి మరోసారి ఓటమి తప్పదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొలనకుదురు, కట్టువపల్లి గ్రామాల్లో మంత్రి కాకాణి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి ధనుంజయరెడ్డి, గుండాల ఆదినారాయణల ఆధ్వర్యంలో కాకాణికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనాతో ప్రజలు తల్లడిల్లిపోతుంటే సోమిరెడ్డి ప్రజలను గాలికొదిలేసి బెంగళూరు, హైదరాబాద్‌లలో తలదాచుకున్నాడన్నారు. కరోనా సమయంలో తాను మాత్రం అన్ని రకాలుగా ప్రజలకు అండగా నిలిచానని గుర్తుచేశారు. సర్వేపల్లి నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపే పరిస్థితి వస్తే నెల్లూరు జిల్లాలోనే కొనసాగేలా చేశానన్నారు. ఇదే నాకు చివరి ఎన్నిక అంటూ సోమిరెడ్డి సెంటిమెంట్ డ్రామా ఆడుతూ మొసలి కన్నీరు కారుస్తున్నాడన్నారు. సోమిరెడ్డి లాంటి నీచుడి మాటలు విని ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయని తెలిపారు. ఏ సర్వే చూసినా సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందనే చెబుతున్నాయన్నారు. దీంతో సర్వేపల్లిలో పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం వల్లే మళ్లీ ఆయనకే సీటు ఇచ్చారని తెలిపారు. అన్నిరకాలుగా ప్రజలకు అండగా నిలిచామని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నేతలు గుండుబోయిన సురేష్, ఎల్లంటి మధురెడ్డి, వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, శానంపూడి సురేందర్‌రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి



కోడూరు పంచాయతీ ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న కేంద్ర బలగాలు

తోటపల్లిగూడూరు : ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఈ మేరకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై జంపానికుమార్ తెలిపారు. మండలంలోని కోడూరు పంచాయతీలో పలు మత్స్యకార గ్రామాల్లో కేంద్ర, పోలీస్ బలగాలతో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లో కవాతు చేస్తూ స్వేచ్ఛగా ఓటు వేయాలని ఓటర్లకు అభయం ఇచ్చారు. అనంతరం ఎస్సై జంపానికుమార్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పార్టీ అభ్యర్థులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

నేడు మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండల పరిధిలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్య గౌడ్ సోమవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు చింతోపులో, 5 గంటలకు ముంగళదొరువులో, 6 గంటలకు సౌత్‌ఆములూరులో ప్రచారం సాగుతుందన్నారు. తొలుత ఉదయం 10 గంటలకు వరిగొండలోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మంత్రి కాకాణి పాల్గొంటారన్నారు.

అయ్యప్పస్వామి ఆలయాల్లో పూజలు

కొడవలూరు: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి జయంతి సందర్భంగా హరిహర పుత్ర మణికంఠ సేవా సమాజం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గురు స్వాములు మునిస్వామి, సుబ్బారావు, సేవా సమాజం సభ్యులు ఒట్టూరు సునీతమ్మ, కె.నాగేశ్వరరావు, నక్కా రమణయ్య, నేతాజీ అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు కోవూరు వెంకీ పాల్గొన్నారు.

శివాలయ ప్రాంగణంలో..

పొదలకూరు : స్థానిక శివాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో స్వామివారి జన్మదిన మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు మూలమూర్తికి అభిషేకం, పూజ, హారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం 6 గంటలకు విశేష పూజలు, హారతి, 6.30 గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు మొలబంటి శేఖర్ బాబు, చొప్పా వెంకటేశ్వర్లు, ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి పాల్గొన్నారు.

పెరుగుతున్న వేసవి తాపం



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా పట్టణంలోని గేటుసెంటర్

పొదలకూరు : పొదలకూరు ప్రాంతంలో ఎండల తీవ్రత పెరుగుతోంది. గతేడాది కంటే ఈసారి ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో మార్చిలోనే ఎండల కాక మొదలైంది. ఈ ప్రాంతానికి వెలికొండలు దగ్గరగా ఉండడం, మెట్టప్రాంతం కావడంతో ఎండలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీల ఉష్ణోగ్రత అదనంగా ఉంటున్నాయి. ఉదయం 11.30 గంటల తర్వాత సెగలు పెరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎండల తీవ్రత నుంచి కాపాడుకోవాల్సిందిగా అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఎండలకు బయటకు రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తువాలు, టోపీలు ధరించాల్సిందిగా వైద్యులు పేర్కొంటున్నారు. అలాగే గొడుగులు వేసుకుని వెళ్లడం మంచిదంటున్నారు. తాగునీటిని అధికంగా సేవించాలని, నీటిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కలుపుకుని తాగితే వడదెబ్బ నుంచి రక్షించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

హోలీ సంబరం



ముత్తుకూరు : రంగులు చల్లుకుంటూ వెళ్తున్న మహిళలు

ముత్తుకూరు : మండల పరిధిలో హోలీ పండగ సంబరాలు సోమవారం కోలాహలంగా జరిగాయి. ప్రాజెక్టుల ప్రభావిత గ్రామాల్లో కార్మికులు, వారి కుటుంబీకులు ఉదయం నుంచే ఉత్సాహంగా రంగులు చల్లుకొంటూ సందడి చేశారు. ముఖ్యంగా నేలటూరు, మామిడిపూడి, ముత్తుకూరు, పంటపాళెం, ఈపూరు, నారికేళపల్లి, పిడతాపోలూరు పంచాయతీల్లో హోలీ వాతావరణం సంతరించుకుంది. చిన్నపిల్లలు, యువతీ యువకులు రంగులు చల్లుకొంటూ గ్రామాలన్నీ కలియతిరిగారు. ఇతర రాష్ట్రాల మహిళలు పిల్లలతో సహా తమ సహచరులను వెంటబెట్టుకుని రంగులు చల్లుకున్నారు.

రాధే రాధే కృష్ణ మందిరంలో..

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలోని రాధే రాధే కృష్ణ మందిరంలో హోలీ సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రాధా కృష్ణ వేషధారణలో పిల్లలను కూర్చోబెట్టి హోలీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పిల్లలు, పెద్దలు కలిసి రంగులు చల్లుకుంటూ డ్యాన్సులు చేస్తూ సరదాగా గడిపారు. మందిర సభ్యులు మనోజ్‌కుమార్, వరదగల్లు హరిబాబు, మందిపాటి రమేష్‌బాబు, పుత్తూరు వెంకటరత్నం, శంకరమ్మ, మల్లి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: హోలీ సంబరాల్లో యువతీ, యువకులు

వెన్నుపోటుకు కేరాఫ్ టీడీపీ

- జెండా మోసిన వారికి మొండిచేయి

ఇందుకూరుపేట : వెన్నుపోటు రాజకీయాలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కేరాఫ్‌గానే నిలుస్తోంది. తాజాగా టీడీపీలో ఆది నుంచి జెండా మోసిన పార్టీ నేతలను పక్కన పెట్టి వలస నేతలకు ప్రాధాన్యం ఇవ్వడంపై తెలుగు తమ్ముళ్లు ఆవేదన చెందుతున్నారు. టీడీపీ ఇందుకూరుపేట మండలాధ్యక్షుడు రావెళ్ల వీరేంద్రనాయుడును ఆ పార్టీ నాయకులు పక్కన పెట్టేయడం చర్చనీయాంశమైంది. ఇందుకూరుపేట, కోవూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు మండలాలకు సంబంధించి ఆత్మీయ సమావేశం సోమవారం కోవూరులో నిర్వహించారు. దీనికి అన్ని పంచాయతీల నుంచి టీడీపీ నాయకులు జనాన్ని తరలించారు. అయితే ఈ సమావేశం గురించి వీరేంద్రకు ఆహ్వానం అందలేదని తెలిసింది. ఆదివారం రాత్రి గంగపట్నంలో టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి నిరసన సెగ తగలడంతో స్థానిక నేత సుధాకర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి హాజరుకాకుండా తిరిగి వెళ్లిన విషయం తెలిసిందే. దీనిని మనసులో పెట్టుకున్న ఆపార్టీ నాయకులు వీరేంద్రతో పాటు ఆయన అనుచరులకు ఆహ్వానం పంపలేదని తెలిసింది. గంగపట్నంలో సీనియర్ నాయకుడు సుధాకర్‌రెడ్డిది అదే తీరుగా ఉంది. ఆయనకు ఆహ్వానం లేకపోవడంతో సమావేశానికి వెళ్లకపోగా ఎంత వారించినా మాట వినకుండా ఆ గ్రామం నుంచి తెలుగు తమ్ముళ్లు సమావేశానికి తరలిపోయారని తెలిసింది. ఈ దుస్థితికి వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి కారణమని వాపోతున్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండం వేసిన భక్తులు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు సోమవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాత్రి పండరి భజనలు, చెక్క భజనలు, స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో గ్రామపెద్దలు, ఉభయకర్తలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వసంతోత్సవం, ఏకాంతసేవ

బ్రహ్మోత్సవాల చివరిరోజైన సోమవారం వసంతోత్సవం, ఏకాంత సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, ధ్వజావరోహణం, హోమం, నైవేద్యం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. వసంతోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో మంత్రి కాకాణి

పొదలకూరు : పట్టణంలోని విఘ్నేశ్వరపురం కాలనీకి చెందిన సుదీర్ఘకాలం టీడీపీలో కొనసాగుతూ వస్తున్న తురకా అంకయ్య, అచ్చి అశోక్, దేవళ్ల సుమన్‌తో పాటు 120 కుటుంబాల వారు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వీరికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొదలకూరు మండలంలో టీడీపీ కథ సమాప్తమైందని, తన సొంత మండలం నుంచే 15 వేల మెజారిటీ వస్తుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వల్లనే ఇంత పెద్ద ఎత్తున వలసలు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పొదలకూరు బిట్–3 ఎంపీటీసీ జి.లక్ష్మీకల్యాణి, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలు ఎం.శివప్రసాద్, జి.వేణుగోపాల్‌రెడ్డి, భాస్కర్, శ్రీహరి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయి



పొదలకూరు : ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేస్తున్న పూజితారెడ్డి

పొదలకూరు : సీఎం వైఎస్ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాయని ఆ పార్టీ నేతలు అన్నారు. పట్టణంలోని కాకాణి రమణారెడ్డి నగర్‌లో మంత్రి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా మహిళలు తన తండ్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకుని మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. వీధివీధిలో సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లు వంటి మౌలిక వసతులతో పాటు పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలను పరిష్కరించారన్నారు. వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ సభ్యులు షేక్ షాకీరాబేగం, జి.లక్ష్మీకల్యాణి, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యుడు అంజాద్, నాయకులు కోనం చినబ్రహ్మయ్య, ఎం.శ్రీనివాసులురెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.శివప్రసాద్, బి.భారతమ్మ, ఖాదర్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు..

పట్టణంలోని టైలర్స్‌కాలనీ, శ్రీనివాస లేఅవుట్, టీపీనగర్, సంగంరోడ్డు సెంటర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం మంత్రి కాకాణి కుమార్తె పూజిత ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ నేత అంజాద్ వెల్లడించారు.

కల్యాణపురంలో..

మండలంలోని బిరదవోలు పంచాయతీ కల్యాణపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఐదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఎవరి హయాంలో పథకాలు అందాయో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

చౌకచర్లలో..

విడవలూరు: మండలంలోని చౌకచర్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. కరపత్రాలను అందజేసి కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీరెడ్డి, ఉదయ్ భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను అందజేశారు.

ఆశీర్వదించండి

కొడవలూరు : రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. మండలంలోని టపాతోపులో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ప్రసన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, నాయకులు జనార్దన్‌రెడ్డి, సురేష్, రవి పాల్గొన్నారు.

మోసపూరిత మాటలు నమ్మొద్దు

కోవూరు : టీడీపీ నేతల మోసపూరిత మాటలను నమ్మవద్దని, ఈ ఐదేళ్ల సుపరిపాలనకు పట్టం కట్టాలని డీఏఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు పట్టణంలోని 16వ వార్డులో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, అనూప్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.



కోవూరు : ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొడవలూరు: టపాతోపులో ఇంటింటి ప్రచారం చేస్తున్న చలపతిరావు

టీడీపీ కుట్రను తిప్పికొట్టాలి

టీడీపీ కుట్రలను ఓటు హక్కుతో ప్రజలు తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయని తెలిపారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సుప్రజ, సర్పంచ్ శ్రీవాణి, పార్టీ నేతలు గాజుల మల్లికార్జున్, రాజా, మధు పాల్గొన్నారు.



పొదలకూరు : కల్యాణపురం గ్రామంలో..



కోవూరు : పోతిరెడ్డిపాళెంలో..



విడవలూరు: చౌకచర్ల గ్రామంలో..



ఇందుకూరుపేట : లేబూరులో..

పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ హరినారాయణన్



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కావలి: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. సోమవారం కావలి పాతవూరులో ఉన్న మున్సిపల్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను కావలి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి శీనానాయక్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లందరూ ఎలాంటి అసౌకర్యం లేకుండా ఓటు వేసేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. సి-విజిల్, 1950 కాల్ సెంటర్లకు వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీసి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్, డీఈ సాయిరాం, సెక్టోరల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, బీఎల్వోలు ఉన్నారు.

న్యాయవాదుల మృతికి సంతాపం

నెల్లూరు(లీగల్): జిల్లా కోర్టు హాల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని అధ్యక్షతన న్యాయవాదుల మృతికి సంతాప సభను సోమవారం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన నెల్లూరు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు బూరగ మురళి, సీమణి, మన్నెపల్లి వెంకటాద్రి, వసీంఅక్రమ్, అన్నదేవుల రామచంద్రారెడ్డికి సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారి జీవిత విశేషాలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ వివరించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.